E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 26-09-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఫైటర్ జెట్ సిమ్యులేటర్ల తయారీలో ముందడుగు » 3లో



# సర్కారు చేతికి మెట్రో రైలు

కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య చర్చల్లో అంగీకారం

బ్యాంకుల నుంచి ఆ సంస్థ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వానిదే

మరో రూ.2 వేల కోట్లు ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం

ఈకబురు,హైదరాబాద్: హైదరాబాద్ మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రభుత్వం చేతిలోకి రానుంది. మెట్రో రైలును కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య గురువారం జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. గత కొన్ని రోజులుగా పలు ప్రత్యామ్నాయాలపై చర్చలు జరగగా... గురువారం జరిగిన చర్చల్లో తుది నిర్ణయానికి వచ్చారు. మెట్రో రైలు కోసం బ్యాంకుల నుంచి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మరో రూ.2 వేల కోట్లను ఎల్ అండ్ టీకి ప్రభుత్వం ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో ఇది కీలకంగా మారనుంది. ఈ నిర్ణయం అమలుకు తదుపరి కార్యాచరణ ప్రారంభిస్తున్నామని, ఇది పూర్తయితే దేశంలో ఉన్న 23 మెట్రోలలో ప్రైవేటు రంగం చేతిలో ఉన్న ఒకే ఒక మెట్రో కూడా ప్రభుత్వం చేతికొచ్చినట్లు అవుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

**రెండో దశకు అడ్డంకిగా మారకూడదని...**

వచ్చే మూడేళ్లలో మెట్రో రైలు రెండో దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని... కేంద్రానికి డీపీఆర్ పంపింది. అయితే మొదటి దశ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్నందున ఆ సంస్థతో అవగాహనకు రావాలని కేంద్రం సూచించడంతో పాటు పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఒప్పందం చేసుకోవడానికి ఎల్ అండ్ టీ అంగీకరించకపోవడంతో... రెండో దశకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మొదటి దశను ప్రభుత్వమే తీసుకోవాలని నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అవి ఓ కొలిక్కి వచ్చిన తరువాత గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్, సంస్థ సీఎండీ సలహాదారు డి.కె.సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ కె.వి.బి.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పట్టణ రవాణా ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.

తరువాయి 2లో

# ఇక గ్రూప్-2, 3 భర్తీపై దృష్టి

- 19 నెలల్లోనే గ్రూప్-1 ప్రక్రియను పూర్తిచేసిన టీజీపీఎస్సీ
- గత 40 ఏళ్లలోనే అత్యంత తక్కువ వ్యవధిలో భర్తీ
- గ్రూప్-2లో 783 పోస్టులు, గ్రూప్-3లో 1365
- ఇప్పటికే పూర్తైన పరీక్షలు, ఫలితాల వెల్లడి

తరువాయి 2లో




## ప్రతి ఆయుధం మీద మేకిన్ ఇండియా

- చిప్‌ల నుంచి షిప్‌ల దాకా ఇక్కడే తయారీ
- జీఎస్టీతో అన్ని ధరలు తగ్గాయి: మోదీ



తరువాయి 2లో

# టార్గెట్.. టాప్ లీడర్స్

- మావోల నాయకత్వాన్ని తుద ముట్టించేలా ఎన్‌కౌంటర్లు
- ఇప్పటికే 9 మంది కేంద్ర కమిటీ సభ్యుల మరణం



ఉత్సాహంగా భారత్

» 6లో




అల్లు అర్జున్ సలహాతోనే అలా తీర్చిదిద్దుకున్నా!

» 5లో



అయిదో రోజూ అదే పతనం

» 4లో



## స్మితా సభర్వాల్‌పై చర్యలొద్దు



కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు

కేసీఆర్, హరీశ్, ఎస్కే జోషి పిటిషన్లతో కలిపి స్మిత వేసిన పిటిషన్‌పై విచారణ: హైకోర్టు

తరువాయి 2లో





## పాలస్తీనాపై మోదీ సర్కారు మౌనం సరికాదు: సోనియాగాంధీ

ఈ-కబురు, దిల్లీ: పాలస్తీనా అంశంపై మోదీ సర్కారు మౌనం.. మానవత్వం, నైతికతలకు తిలోదకాలు ఇచ్చేలా ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మండిపడ్డారు.

» 3లో

## ఎన్నికలే ఎజెండా..



- పార్టీ నేతలతో బీఆర్ఎస్ అధినేత కీలక భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక పోరుపై దిశానిర్దేశం
- జిల్లా నేతలతో కేటీఆర్,హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్
- బతుకమ్మ ద్వారా సర్కారును ఎండగట్టాలని ఆదేశం

తరువాయి 2లో



## రష్యాతో మరింత పటిష్ఠ బంధం

» 3లో

ఈ-కబురు

26- 09 -2025
శుక్రవారం
e-kaburu.com

మొదటి పేజి తరువాయి

# సర్కారు చేతికి మెట్రో రైలు

వచ్చే మూడేళ్లలో మెట్రో రైలు రెండో దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని... కేంద్రానికి డీపీఆర్ పంపింది. అయితే మొదటి దశ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్నందున ఆ సంస్థతో అవగాహనకు రావాలని కేంద్రం సూచించడంతో పాటు పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఒప్పందం చేసుకోవడానికి ఎల్ అండ్ టీ అంగీకరించకపోవడంతో... రెండో దశకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మొదటి దశను ప్రభుత్వమే తీసుకోవాలని నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అవి ఓ కొలిక్కి వచ్చిన తరువాత గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్, సంస్థ సీఎండీ సలహాదారు డి.కె.సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ కె.వి.బి.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పట్టణ రవాణా ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు. మొదటి, రెండో దశ కలిపి నిర్వహణ తదితర అంశాలపై చర్చించిన తరువాత మొదటి దశ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేయడానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీనికి ఎల్ అండ్ టీ కూడా అంగీకారం తెలిపింది.

రెండో దశలో ఈక్విటీ భాగస్వామిగా ఉండేందుకు ఎల్ అండ్ టీ నిరాకరణ

సమావేశం అనంతరం ప్రభుత్వం, మెట్రో రైలు గ్రూపు నుంచి ఓ ప్రకటన విడుదలైంది. దీని ప్రకారం.. హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రజా రవాణా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని రెండో దశ ఏ, బీ కింద ఎనిమిది లైన్లతో మొత్తం 163 కి.మీ. దూరం అదనపు మెట్రో నిర్మాణానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పలు దఫాలుగా సమీక్షించింది. మొదటి దశ ప్రైవేటు చేతిలో ఉండగా, రెండో దశ ప్రభుత్వం చేపడుతుందని... రెండింటినీ కలిపి సమీకృత నిర్వహణకు ఒప్పందానికి (డెఫినెటివ్ అగ్రిమెంట్) రావాలని కేంద్రం సూచించింది. ఇది జరిగితేనే తదుపరి ప్రక్రియను ప్రాసెస్ చేయగలమని పేర్కొంది. దీంతోపాటు రెండో దశలో కేంద్ర ప్రభుత్వం తరపున జాయింట్ వెంచర్‌గా పాల్గొనాలని ఎల్ అండ్ టీని కేంద్రం కోరింది.

అయితే రెండో దశలో భాగస్వామిగా ఉండటానికి గానీ, మొదటి రెండు దశలు కలిపి నిర్వహించడానికి అంగీకారం తెలుపుతూ ఒప్పందంపై సంతకం చేయడానికి గానీ ఎల్ అండ్ టీ అంగీకరించలేదు. మెట్రో రైలులో తమ వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి లేదా కేంద్రానికి విక్రయించడానికి ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో 2014 నవంబరు నుంచి నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సీనియర్ అధికారులతో కలిసి ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్, సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో చర్చించారు. మెట్రో రైలు విస్తరణ రెండో దశలో ఈక్విటీ భాగస్వామిగా ఉండాలని సీఎం కోరగా... ఎల్ అండ్ టీ ఛైర్మన్ అంగీకరించలేదు. మొదటి, రెండో దశ సమీకృత నిర్వహణ ఒప్పందంపై సంతకం చేయాలని సీఎం కోరారు. ఇందులో ఆదాయం, నిర్వహణ వ్యయంలో ఎవరి వాటా ఎంత అన్న దానికి ప్రత్యేక మెకానిజం కూడా ఉంది. అయితే రెండు దశల మధ్య రైళ్ల నిర్వహణ, ఆదాయం, నిర్వహణ వ్యయం వాటాలపై ప్రత్యేక యంత్రాంగానికి మెకానిజం తదితర అంశాల్లో ఉన్న ఆందోళనల కారణంగా సంతకం చేయలేమని ఎల్ అండ్ టీ ఛైర్మన్ పేర్కొన్నారని ప్రకటనలో ప్రభుత్వం వివరించింది. కేంద్ర ప్రభుత్వం రెండో దశ మెట్రోను ప్రాసెస్ చేయడానికి వీలుగా ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ముందుకు తెచ్చారు. మొదటి దశలో తమకు ఉన్న వాటా మొత్తం విక్రయిస్తామని, దీనివల్ల మొదటి దశ మొత్తం ప్రభుత్వానికే చెందుతుందని పేర్కొన్నారు.


మరో రూ.5,900 కోట్లు చెల్లించాలన్న ఎల్ అండ్ టీ

తమ వాటా మొత్తం విక్రయిస్తామని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ప్రతిపాదించిన తరువాత ఆర్థికపరమైన అంశాలు, ఆస్తుల విలువ తదితరాలపై చర్చ జరిగింది. మెట్రో రైలుకు ఉన్న రూ.13 వేల కోట్ల అప్పును ప్రభుత్వం తీసుకొని, తమ ఈక్విటీ విలువగా రూ.5,900 కోట్లు చెల్లించాలని సుబ్రమణ్యన్ కోరారు. 2022 జులై 22న జరిగిన అనుబంధ కాన్సెన్సస్ అగ్రిమెంట్ ప్రకారం రూ.మూడు వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.900 కోట్లు మాత్రమే ఇచ్చారని, మరో రూ.2,100 కోట్లు చెల్లించాల్సి ఉందన్న అంశం చర్చకు వచ్చింది. విస్తృతంగా చర్చించిన తరువాత కేంద్ర ప్రభుత్వం నుంచి రెండో దశ ఆమోదం పొందడానికి వీలుగా రూ.13 వేల కోట్ల అప్పును ప్రభుత్వం తీసుకోవడంతోపాటు మెట్రో రైలులో ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.రెండు వేల కోట్లు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వం మొదటి దశ మెట్రో రైలును టేక్‌ఓవర్ చేయడానికి తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు.



మొదటి పేజి తరువాయి

# స్మితా సభర్వాల్‌పై చర్యలొద్దు



ఈ-కబురు,హైదరాబాద్ :కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ ఎస్కే జోషిలకు ఇచ్చిన విధంగానే స్మితా సభర్వాల్‌కు సైతం ఊరటనిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలంటూ వారు దాఖలు చేసిన పిటిషన్లతో కలిపి స్మితా సభర్వాల్ పిటిషన్‌ను విచారిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలకు సంబంధించి అప్పటి సీఎంవో అదనపు కార్యదర్శి స్మితా సభర్వాల్ నిర్లక్ష్యం కూడా ఉందని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది, బీఆర్ఎస్ హయాంలో ఏఏజీగా పనిచేసిన జే. రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. స్మితా సభర్వాల్ ఒక అధికారిగా తన బాధ్యతలు నెరవేర్చారని వివరించారు. కానీ కమిషన్ నివేదిక కారణంగా ప్రభుత్వం ఆమెపై అటు శాఖపరమైన చర్యలు, ఇటు క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ నివేదికను కొట్టివేయాలని కోరారు. ఇక ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కాళేశ్వరం అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్‌పై ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోబోమని పేర్కొన్నారు. ఈ అంశాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. స్మితా సభర్వాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఆదేశాలు జారీచేసింది.

మొదటి పేజి తరువాయి

# ప్రతి ఆయుధం మీద మేకిన్ ఇండియా

ఈకబురు,: చిప్‌ల నుంచి షిప్‌ల వరకు దేశంలోనే అన్నీ తయారయ్యే విధంగా ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశ రక్షణ వ్య వస్థకు సంబంధించి అన్ని ఆయుధాల విడిభాగాల మీద 'మేక్ ఇన్ ఇండియా' ముద్ర ఉండేటట్లు చూస్తామని ప్రకటించారు. గురువారం ఆయన ఢిల్లీ శివారులోని గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, భారత సైనిక వ్యవస్థ కూడా దేశీయ ఆయుధాలనే కోరుకుంటోందని, ఇతర దేశాల మీద ఆధారపడకూడదనే అభిప్రాయంతో ఉందని తెలిపారు. రష్యా భాగస్వామ్యంతో ఉత్తరప్రదేశ్‌లో ఏకే 203 రైఫిళ్లను తయారు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటి ఉత్పత్తి త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. యూపీలో కేవలం రక్షణ ఉత్పత్తుల కోసం ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశంలో వ్యాపారులు చేసే చిన్నచిన్న తప్పులకు కూడా భారీ శిక్షలు పడే విధంగా చట్టాలు ఉ న్నాయని, వాటిని సవరిస్తామని ప్రకటించారు. దేశంలో తయారయ్యే మొబైల్ ఫోన్లలో 55% ఉత్తరప్రదేశ్‌లోనే తయారవుతున్నాయని మోదీ వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచంలో మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో టూత్‌పేస్ట్ మొదలు ట్రాక్టర్ల దాకా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని ఆయన చెప్పారు.



# ఎన్నికలే ఎజెండా..




ఈకబురు,హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలతో కీలక భేటీ నిర్వహించారు. ఎర్రవల్లి నివాసంలో గురువారం జరిగిన ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం కేడర్‌తో జరుగుతున్న సమావేశాల వివరాలను కేటీఆర్ వివరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటర్‌ను చేరుకునేలా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలని కేసీఆర్ ఆదేశించారు.

కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి రిజర్వాయర్ ఎత్తు పెంపుతో కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగే నష్టం గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.

బనకచర్ల లింకు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో రాష్ట్రానికి జరిగే నష్టంపై బీఆర్ఎస్ పోరాడక తప్పదని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై సీబీఐ ప్రాథమిక సమాచార సేకరణ ప్రారంభించిందనే వార్తల నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్ ఎదుట వాదన వినిపించిన తరహాలోనే ముందుకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికలపై టెలి కాన్ఫరెన్స్

రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే వార్తల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు గురువారం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల కొరత మొదలుకుని బతుకమ్మ పండుగ ఏర్పాట్ల వరకు ప్రభుత్వం అన్ని అంశాల్లోనూ విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. స్థానిక ఎన్నికలను సవాల్‌గా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని, ఊరూరా పార్టీ ఆధ్వ ర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించాలని కేటీఆర్ ఆదేశించారు.

# ఇక గ్రూప్2, 3 భర్తీపై దృష్టి




ఈకబురు,హైదరాబాద్:గ్రూప్1 నియామకాల ప్రక్రియ పూర్తయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటి సారిగా నిర్వహించిన గ్రూప్1ను కేవలం 19నెలల్లోనే పూర్తిచేసిన టీజీపీఎస్సీ.. తాజాగా గ్రూప్2, గ్రూప్3 నియామక ప్రక్రియనూ పూర్తిచేయడంపై దృష్టి పెట్టింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటిదాకా గత 40 ఏళ్లలో మొత్తం ఐదుసార్లు గ్రూప్1 పరీక్ష నిర్వహించగా అత్యంత తక్కువ సమయంలో ప్రక్రియ పూర్తయిన సందర్భం ఇదే. వాస్తవానికి గ్రూప్1 నియామక ప్రక్రియ పూర్తయ్యాకే భర్తీ చేస్తే బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండవని భావించిన కమిషన్.. గ్రూప్2, గ్రూప్3 ప్రక్రియను పక్కనబెట్టింది. కోర్టు తీర్పుతో గ్రూప్1ను విజయవంతంగా పూర్తి చేసిన కమిషన్, 2022 నోటిఫికేషన్‌లో ఇచ్చిన గ్రూప్2లోని 783 పోస్టులు, 2023లో ఇచ్చిన గ్రూప్3 నోటిఫికేషన్‌లోని 1365 పోస్టుల భర్తీపై దృష్టిపెట్టింది. ఈ పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఫలితాలు ప్రకటించారు. ప్రక్రియ ప్రస్తుతం □రఉధువీకరణ పత్రాల పరిశీలన దశలో ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన అన్ని పరీక్షలు నోటిఫికేషన్ తర్వాత పూర్తిచేసేందుకు ఏపీపీఎస్సీకి కనీసం మూడేళ్ల సమయం పట్టింది. 1984లో నోటిఫికేషన్ జారీ చేయగా.. పరీక్షలన్నీ పూర్తిచేసి నియామకపత్రాలు అందుకునేందుకు మూడేళ్లు పట్టింది. 1987లో విధుల్లో చేరారు. ఆ తర్వాత 1989లో ఇచ్చిన నోటిఫికేషన్‌తో పరీక్ష రాసిన అభ్యర్థులు 1994లో కొలువుల్లో చేరారు. మళ్లీ 15 ఏళ్ల తర్వాత 2004లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అప్పుడు ప్రక్రియ కాస్త వేగంగా జరిగింది. మూడేళ్లలో అంటే 2007లో నియామక పత్రాలు అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2011లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ సుదీర్ఘంగా సాగి 2018లో పూర్తయింది. ఉమ్మడి రాష్ట్రంలో గ్రూప్1 చరిత్రలో ఎక్కువ సమయం తీసుకుంది అప్పుడే. అప్పుడు ఏడేళ్ల సమయం పట్టింది. తెలంగాణ ఏర్పాడ్డక బీఆర్ఎస్ హయాంలో తొలిసారి 2022లో వెలువడిన గ్రూప్1 నోటిఫికేషన్ పేపర్ లీక్‌తో మధ్యలోనే రద్దయింది.

ఆ తర్వాత గత కేసీఆర్ ప్రభుత్వం మరోసారి నిర్వహించినా బయోమెట్రిక్ నిర్లక్ష్యం, సవరణలపై కేసులతో గత ప్రభుత్వ కాలం ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశారు. ఫిబ్రవరి2024లో గ్రూప్1 నోటిఫికేషన్ విడుదలచేసింది. మే, జూన్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా.. సెప్టెంబరు, అక్టోబరులో మెయిన్స్ నిర్వహించారు. ఈ ఏడాది మార్చి10న ఫలితాలు ప్రకటించారు. ఫలితాలపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించడంతో ఏప్రిల్‌లో పూర్తి కావాల్సిన ప్రక్రియ ఐదు నెలలు ఆలస్యమైంది. బుధవారం మధ్యాహ్నం కోర్టు తీర్పు వచ్చిన 12 గంటల్లోపే తుది జాబితాను టీజీఎస్‌పీఎస్సీ ప్రకటించేసింది. గ్రూప్1 నోటిఫికేషన్ ప్రకటించిన 7నెలల్లోపే ప్రాథమిక, ప్రధాన పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన టీజీఎస్‌పీఎస్సీ 11నెలల్లోనే ఫలితాలను ప్రకటించింది. మొత్తంగా 19 నెలల్లో తుది జాబితా విడుదలచేసి ప్రక్రియను ముగించింది. గత నాలుగు దశాబ్దాల్లో నిర్వహించిన పరీక్షలో అత్యంత వేగంగా పూర్తయిన పరీక్ష ఇదే కావడం గమనార్హం.

రేపు గ్రూప్1 అభ్యర్థులకు నియామక పత్రాలు

గ్రూప్1 అభ్యర్థులకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేస్తారని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అభ్యర్థితో పాటు వారి కుటుంబం నుంచి ఇద్దరిని కార్యక్రమానికి అనుమతించాలని సూచించారు. కాగా, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

# ఫైటర్ జెట్ సిమ్యులేటర్ల తయారీలో ముందడుగు



ఈకబురు, , హైదరాబాద్: డ్రోన్లు, క్షిపణులు, విమానాల విడి భాగాలు, రక్షణ రంగ ఉత్పత్తులతో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్ మరో భారీ ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో టివర్క్స్ వేదికగా యుద్ధ విమానాల ఫైటర్ జెట్ సిమ్యులేటర్ రూపుదిద్దుకుంటోంది. యుద్ధ విమానాల పైలట్ల శిక్షణ కోసం అవసరమయ్యే లెవెల్‌డి ఫుల్ ఫైటర్ సిమ్యులేటర్లను ఇప్పటి దాకా భారీ వ్యయంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా.. ఇకపై ఆ అవసరం ఉండదు. యాక్సియల్ ఏరో ప్రైవేట్ లిమిటెడ్ ఈ సిమ్యులేటర్ల తయారీకి అన్ని అనుమతులు సాధించి వాణిజ్య ఉత్పత్తి మొదలు పెట్టింది. వచ్చే మూడేళ్లలో ఐదు సిమ్యులేటర్లను సరఫరా చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ నెలకొల్పిన ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్‌తో భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రస్తుతం మన ఎయిర్‌ఫోర్స్ దిగుమతి చేసుకుంటున్న ఒక్కో ఫైటర్ జెట్ సిమ్యులేటర్ వ్యయం రూ.50 కోట్ల దాకా ఉండగా.. యాక్సియల్ ఏరో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లకే అందజేస్తుంది.

అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

ఇటీవల టివరక్స్‌ను సందర్శించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దాదాపు రెండు గంటల సేపు ఈ పరిశోధనల పురోగతిని పరిశీలించి, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. తక్కువ సమయంలో క్లిష్టమైన పరిశోధనలను పూర్తి చేసి.. ఆర్డర్లు సాధించినందుకు ప్రశంసించారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

జోగిందర్, టివర్క్స్ సీఈవో

"ఎయిర్‌ఫోర్సులో పైలట్లుగా ఎంపికైన అభ్యర్థులకు మొదట ఫైటర్‌జెట్ సిమ్యులేటర్లలో శిక్షణ ఇస్తారు. విమానం ఎగిరే కృత్రిమ వాతావరణాన్ని సృష్టించే సిమ్యులేటర్లు.. నిజంగా ఎయిర్‌క్రాఫ్ట్‌ను గాలిలో నడిపిన అనుభూతిని ఇస్తాయి. ఇక్కడ తయారయ్యే సిమ్యులేటర్లు.. దిగుమతి చేసుకునే వాటి కంటే అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉంటాయి. దిగుమతి చేసుకునేవి.. బేస్ నుంచి అన్ని వైపులా 30 డిగ్రీల మేరకు మాత్రమే వంచడానికి, పైకి లేపడానికి అవకాశం ఉంటుంది. యాక్సియల్ ఏరో రూపొందిస్తున్న సిమ్యులేటర్లు.. 360 డిగ్రీల మేరకు తిప్పగలిగేలా స్టివార్టు ప్లాట్‌ఫామ్‌ను కలిగి ఉంటాయి. యుద్ధ క్షేత్రంలో శత్రువుకు దొరకకుండా తప్పించుకునేందుకు ఫైటర్ జెట్లను నడిపించే పైలట్లు అనుసరించే విన్యాసాలన్నీ ఇందులో సాధ్యమవుతాయి".

# టార్గెట్.. టాప్ లీడర్స్

ఈకబురు, వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సగానికి పైగా తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పటికైనా మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు ఇటీవల ప్రకటించారు. 'మరోవైపు తలను తీసేస్తే కాళ్లు చేతులు ఏ పనీ చేయలేవు.. అందుకే మేము కిందిస్థాయి కేడర్ కంటే పైస్థాయిలో ఉన్న పెద్ద తలలే టార్గెట్‌గా యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ చేపడుతున్నాం'అని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్‌సన్ గుడియా ఇటీవల మీడియాకు వెల్లడించారు. పోలీస్ బాస్‌ల ప్రకటనలకు తగ్గట్టుగానే ఏడాది కాలంలో ఏకంగా తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు. దీంతో 2026 మార్చి 31 కంటే ముందుగానే మావోయిస్టులు అంతమైపోతారనే వాదనలు జోరందుకున్నాయి.

మృతుల్లో తొలితరం నేతలే

కొండపల్లి సీతారామయ్య పీపుల్స్‌వార్ పార్టీని స్థాపించిన తొలినాళ్లలోనే ఉత్తర తెలంగాణ, దండకారణ్యం పర్‌స్పెక్టివ్ దృష్టితో పార్టీకి గెరిల్లా జోన్లు విస్తరించే పనిపై దృష్టి పెట్టారు. 1980లో బస్తర్ పంపిన తొలి బ్యాచ్‌లో కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా ఉండగా 1985-86లో పంపిన రెండో బ్యాచ్‌లో కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ వికల్ప్ ఉన్నారు. ఇందులో వికల్ప్, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో వాసు పేరుతో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే మైదాన ప్రాంతాల్లో పార్టీకి కావాల్సిన అండదండలు అందిస్తూ వచ్చారు.

ఆ తర్వాత కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటి వరకు మావోయిస్టుల అగ్రనేతలు, కేంద్ర కమిటీకి సంబంధించిన ప్రస్తావనలో ఎక్కువగా 80వ దశకంలో పార్టీలో కీలకంగా వ్యవహరించిన వారి పేర్లే ఎక్కువగా తెర మీదకు వస్తున్నాయి. అయితే, వీరి తర్వాత కాలంలో పూర్తిగా రహస్య ఆపరేషన్లు చేపట్టే బ్యాచ్ ఒకటి దండకారణ్యం వెళ్లినట్టు తెలుస్తోంది.

కరోనా తర్వాత నష్టాలు

కరోనా సెకండ్ వేవ్ తర్వాత మావోయిస్టు పార్టీ స్థితిగతుల్లో మార్పులు ఎక్కువగా వచ్చాయి. ఆపరేషన్ సమాధాన్-ప్రహార్‌తో మావోయిస్టుల సప్లై చెయిన్‌పై పోలీసుల నిఘా పెరిగింది. మరోవైపు వాయుమార్గంలో దాడులు కూడా ప్రారంభమయ్యాయి. వెరసి నిర్బంధం తీవ్రం కావడం, కరోనా కష్టాలతో పరిస్థితులు మారిపోవడం మొదలైంది.

అనారోగ్య కారణాలతో రమణ, హరిభూషణ్ అలియాస్ యాప నారాయణ, రామకృష్ణ అలియాస్ ఆర్కే, కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌లు మరణించారు.

ఆ తర్వాత 2021లో మహారాష్ట్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మిలింద్ బాబురావు తేల్‌టుంబే చనిపోయాడు. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత ఏకంగా తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు.

బెంగాల్ నుంచి ప్రశాంత్‌బోస్, శీలామరాండీలు 2021లో లొంగిపోగా ఇటీవల పోతుల కల్పన అలియాస్ సుజాత కూడా లొంగిపోయింది. మొత్తంగా కరోనా తర్వాత 17 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఆ పార్టీ కోల్పోయింది.



## రష్యాతో మరింత పటిష్ఠ బంధం

ఈకబురు, గ్రేటర్ నొయిడా: కాలపరీక్షకు నిలిచినా.. రష్యాతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో ముందుకే సాగుతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా రక్షణ బంధం కొనసాగుతోందని గుర్తు చేశారు. ఆత్మ నిర్భరత (స్వయం సమృద్ధి) సాధించేందుకు కృషి చేస్తున్నామని, భారత్ లాంటి దేశం ఏ ఒక్కరిపైనా ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని నొయిడాలో గురువారం యూపీ అంతర్జాతీయ ట్రేడ్ షో2025 ప్రారంభమైంది. ఇందులో రష్యా అంతర్జాతీయ భాగస్వామిగా ఉంది. ఈ ట్రేడ్ షోలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. 'ఈసారి అంతర్జాతీయ ట్రేడ్ షో వాణిజ్య భాగస్వామిగా రష్యా ఉంది. అంటే దీనిద్వారా మనం కాల పరీక్షకు నిలిచినా బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలను కొంటున్న భారత్‌పై మరిన్ని ఆంక్షలకు సిద్ధమవుతున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తద్వారా ఆ దేశం హెచ్చరికలను భారత్ పట్టించుకోదనే సందేశాన్ని ఆయన ఇచ్చినట్లయింది. 'భారత సైన్యం స్వదేశీ ఆయుధ సంపత్తిని కోరుకుంటోంది. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. భారత్ స్వయం సమృద్ధిని సాధించాలి. ఇక్కడ వినియోగించే ప్రతి వస్తువూ ఇక్కడే తయారుకావాలి. త్వరలో ఏకే203 తుపాకులను రష్యా సహకారంతో భారత్‌లోనే తయారు చేయబోతున్నాం. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటవుతోంది. పలు ఆయుధాలను దేశీయంగా తయారు చేస్తాం. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ ఇప్పటికే ప్రారంభమైంది' అని ప్రధాని వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు కొనసాగుతాయని, ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

టూత్ పేస్ట్ నుంచి ట్రాక్టర్ దాకా..

'2014కు కంటే ముందు రూ.1,000 చొక్కాపై 170 పన్ను పడేది. 2017లో జీఎస్టీ ప్రవేశపెట్టాక పన్ను రూ.50కి తగ్గింది. తాజాగా జీఎస్టీ సంస్కరణల తర్వాత పన్ను రూ.35కు తగ్గిపోయింది' అని ప్రధాని వివరించారు. 2014కు ముందు నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, షాంపూ, తలకు రాసే నూనె, షేవింగ్ క్రీమ్‌లపై రూ.100 ఖర్చు చేస్తే రూ.31 పన్నుగా చెల్లించాల్సి వచ్చేది. 2017లో జీఎస్టీ వచ్చాక ఆ పన్ను రూ.18కి తగ్గింది. తాజా జీఎస్టీ సంస్కరణలతో ఆ పన్ను రూ.5కు తగ్గిపోయింది. 2014 కంటే ముందు రూ.లక్ష ఇంటి ఖర్చులపై రూ.20,000 నుంచి రూ.25,000 వరకూ పన్నులు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం అ పన్నులు రూ.5,000 నుంచి రూ.6000కు తగ్గిపోయాయి. గతంలో ట్రాక్టరుపై రూ.70,000 పన్ను ఉండేది. ఇప్పుడది రూ.30,000కు తగ్గింది. పేదల ఉపాధి కల్పించే త్రిచక్ర వాహనాలపైనా పన్ను రూ.55,000 నుంచి రూ.35,000కు తగ్గిపోయింది. స్కూటర్లపై రూ.8,000, మోటారు సైకిళ్లపై రూ.9,000 పన్నులు తగ్గాయి' అని మోదీ వివరించారు. బాంస్‌వాడా: ఏ దేశమైనా వేగంగా అభివృద్ధి చెందాలంటే గణనీయంగా విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు ప్రాధాన్యాన్ని విస్మరించిందని ఆరోపించారు. రాజస్థాన్‌లోని బాంస్‌వాడాలో పునరుత్పాదక ఇంధనం, మౌలిక సదుపాయాల రంగాల్లో రూ.1.22 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 'కాంగ్రెస్ హయాంలో అంతటా దోపిడీ జరిగేది. పన్నులు, ద్రవ్యోల్బణం రెండూ ఆకాశాన్ని తాకేవి. అవినీతి కారణంగా కేంద్ర పథకాలు సరిగ్గా అమలు కాని పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం వీటిని కట్టడి చేసింది' పేర్కొన్నారు.

## అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి
## అనీల్ కుమార్ యాదవ్

**దేవీ నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనీల్ కుమార్ యాదవ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని కోరుకుంటున్నట్లు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందానగర్ డివిజన్ పరిధిలో యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపాన్ని, లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని గురువారం అనిల్ కుమార్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ హిందువులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, వైభవంగా నిర్వహించే వేడుకల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఒకటని అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ప్రతిరోజు ఒక్కో అవతారంలో దర్శనం ఇస్తూ భక్తులకు అనుగ్రహం కల్పిస్తుందన్నారు. శక్తికి రూపంగా భావించే అమ్మవారిని భక్తులు నవరాత్రి ఉత్సవాల్లో నిష్టతో, భక్తిశ్రద్ధలతో పూజించుకుంటారని తెలిపారు. దేవి శరన్నవరాత్రి, బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనీల్ కుమార్ యాదవ్


అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనీల్ కుమార్ యాదవ్

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలు
## స్ఫూర్తిదాయకం : గంగల రాధాకృష్ణ యాదవ్

**మాదాపూర్ డివిజన్ లో "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమం**

ఈకబురు, శేరిలింగంపల్లి : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు, ఆయన చేసిన సేవలు మనందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో సమాజం ముందుకు సాగాలనీ సేవా పక్షం కన్వీనర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగల రాధాక్రిష్ణ యాదవ్ అన్నారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా. మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ లో "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి రాధాక్రిష్ణ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటడం మన కర్తవ్యంగా భావించాలనీ కోరారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు, ఆలోచనలను అంకిత భావంతో ఆచరించడమే ఆ మహానుభావుడికి మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. పార్టీని దేశమంతటా విస్తరించడంలో ఆయన చేసిన కృషి ఎన్నటికీ మర్చిపోలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ శ్రీగిరి సత్యనారాయణ, ప్రెసిడెంట్ గోలి వేణుగోపాల్ రెడ్డి, సేవా పక్షం కన్వీనర్ మహేంద్ర యాదవ్, డివిజన్ సెక్రటరీ రాగిణి కిరణ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్న శ్రీశైలం కురుమ, జిల్లా ఐటీ కోకన్వీనర్ నాయిని ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గురు యాదవ్, మురళి, ముకేశ్, స్థానికులు పెంద్యాల రంజిత్ కుమార్, మహేష్ రవ్వ, అల్లాడి ప్రవీణ్, గోంగూలూరి ప్రవీణ్ రెడ్డి, కిరణ్ అంచురి, నరేంద్ర, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న రాధాకృష్ణ యాదవ్ తదితరులు

## హెచ్1బీ ఫీజు పెంపుపై న్యాయపోరాటానికి రంగం సిద్ధం..?




హెచ్1బీ వీసా ఫీజు ను 1,00,000 డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయంపై న్యాయపోరాటం చేసే అంశాన్ని ఆ దేశ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పరిశీలిస్తోంది. ఈవిషయాన్ని బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈ పోరాటానికి ఎన్ని కంపెనీలు మద్దతు ఇస్తాయనే దానిపై ఓ అవగాహనకు వచ్చేందుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సభ్యత్వం ఉన్న కంపెనీలతో టెలిఫోన్, వర్చువల్ మీటింగ్‌ల్లో చర్చిస్తోంది. హెచ్1బీ వీసా లను అధికంగా వినియోగించే టెక్ కంపెనీలు ట్రంప్ నిర్ణయంతో ఇబ్బందిపడుతున్న విషయాన్ని ఇది సూచిస్తోంది. 2020లో నాన్ ఇమిగ్రెంట్ వీసాల జారీని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని కూడా యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసింది. అంతేకాదు.. నాడు విజయం కూడా సాధించింది. తాజాగా ఛాంబర్ ప్రతినిధి మాట్ లెటోర్నో మాట్లాడుతూ ''మా సభ్యుల ఆందోళనలు నిరంతరం మా వద్దకు చేరుతున్నాయి. ఈవిషయాన్ని అడ్మినిస్ట్రేషన్ దృష్టికి తీసుకువెళతాం. ప్రస్తుతం హెచ్1బీ వీసాల ఫీజు పెంపు వల్లే.. ప్రస్తుత వీసాదారులపైనా ఆయన ప్రకటన చేయవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే ట్రంప్ కార్యవర్గం కొన్నింటిపై స్పష్టతలు ఇచ్చినందుకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు.

**ఐరాసలో నాకు అవమానం : దర్యాప్తు చేయాలని సీక్రెట్ సర్వీస్‌కు ట్రంప్ ఆదేశం**

హెచ్1బీ వీసాల ఫీజుల పెంపుపై ట్రంప్ చేసిన ప్రకటనకు ఉన్న చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. ఫెడరల్ ఇమిగ్రేషన్ చట్టం యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ ఫీజు వసూలుచేసేందుకు అనుమతించింది. అది కూడా దాని ఖర్చులకు సరిపోయేంత మాత్రమే. గతంలో ఉన్న ఫీజు విధానాన్ని కాంగ్రెస్ ఆమోదించింది. అవసరమైనప్పుడు దానిని సవరిస్తోంది. దీన్నిబట్టి హెచ్1బీ వీసాలపై స్వతంత్రంగా సర్‌ఛార్జి విధించే అధికారం ట్రంప్‌నకు లేదని తెలుస్తోంది.

అయితే దీనిపై ట్రంప్ వాదన భిన్నంగా ఉంది. అమెరికా ప్రయోజనాలకు ప్రమాదకరం అని భావించిన విదేశీ వ్యక్తులను నిలువరించే అధికారం తనకు ఉందని చెబుతున్నారు. గతంలో కొన్ని ముస్లిం దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించినప్పుడు కూడా ఈ అధికారాన్నే ఆయన వాడుకొన్నట్లు ఆ దేశ సుప్రీంకోర్టులో వాదించారు. నాడు న్యాయస్థానం దానిని సమర్థించింది. అయితే హెచ్1బీ కేసులో జాతీయ భద్రత కంటే ఆర్థిక ప్రయోజనాలే కనపడుతుండటంతో కోర్టులో అది ఏమేరకు నిలుస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

## గౌలిదొడ్డి దేవాలయంలో
### కాత్యాయని దేవి రూపంలో
## దర్శనమిచ్చిన అమ్మవారు


కాత్యాయని దేవి రూపంలో అమ్మవారు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలోని పోచమ్మ–ఎల్లమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల నాలుగో రోజు శ్రీశ్రీశ్రీ కాత్యాయని దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అమ్మవారి దర్శనం కోసం గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించబడిన ఆలయం భక్తుల రాకతో సందడిగా మారింది. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ అధ్యక్షులు జంగయ్య యాదవ్ సారథ్యంలో ఈ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పించనున్నట్టు జంగయ్య యాదవ్ తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. శక్తికి రూపమైన అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారని, పరిసర ప్రాంత భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.


నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూలతో అలంకరించిన దేవాలయం

## ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయ్.. జెలెన్‌స్కీ



ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ( వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధ పోటీ నెలకొందన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో మాట్లాడిన ఆయన.. రష్యాకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.

ఐరాస సహా ఇతర బలహీన అంతర్జాతీయ సంస్థలు ఉక్రెయిన్, గాజా, సుడాన్‌లో యుద్ధాలను నిలువరించలేకపోయాయని ఎండగట్టారు. "ఎవరు ప్రాణాలతో ఉండాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయి. ఈ ప్రపంచంలో స్నేహితులు లేకపోతే ఆయుధాలు మాత్రమే ఉంటాయి. ఎలాంటి భద్రతా హామీలు ఉండవు. మాపై యుద్ధాన్ని రష్యా పొడిగిస్తూనే ఉంది. దానిని అంతర్జాతీయ సమాజం ఖండించాలి. పుతిన్‌ను ఇప్పుడు ఆపకపోతే.. ఈ యుద్ధం మరింత విస్తరిస్తుంది. రష్యా డ్రోన్లు యూరప్ అంతటా ఎగురుతున్నాయి" అని జెలెన్‌స్కీ హెచ్చరించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించింది . గత మూడేళ్లకు పైగా ఈ యుద్ధం కొనసాగుతూనే ఉంది. దానిని ఆపేందుకు జరుగుతోన్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగినా కూడా యుద్ధాన్ని ఆపలేకపోతున్నారు.

రష్యా 'పేపర్ టైగర్' కాదు.. 'బేర్' - ట్రంప్‌నకు క్రెమ్లిన్ కౌంటర్

ఇదిలాఉంటే.. భారత్ తరపున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఐరాస సభలో మాట్లాడారు. " పెరుగుతున్న అనిశ్చితులు, ప్రపంచ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్న సమయంలో మనం సమావేశం అయ్యాం. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు పలు సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. మహమ్మారి నుంచి తేరుకోకముందే ఉక్రెయిన్, గాజా యుద్ధాలు మొదలు ప్రతికూల వాతావరణ సంఘటనలు, అస్థిర వాణిజ్యం.. పెట్టుబడుల ప్రవాహం, వడ్డీ రేట్లలో అనిశ్చితితోపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండాలో గణనీయ క్షీణత కనిపించడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం" అని జైశంకర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలు
## చిరస్మరణీయం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**గచ్చిబౌలిలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో శ్రీ పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో గల కార్పొరేటర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనసంఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, పార్టీ రాజకీయ సిద్ధాంతం ఏకాత్మతా మానవతా వాదాన్ని రూపొందించడంలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. పార్టీని దేశమంతటా విస్తరించడంలో ఆయన చేసిన కృషి ఎన్నటికీ మర్చిపోలేనిదని తెలిపారు. భారతదేశం ఒక స్వతంత్ర, స్వాలంబన దేశంగా ఉండటమే ప్రధాన ఉద్దేశ్యంగా, వ్యక్తివాదం, సోషలిజం, కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానం వంటి పాశ్చాత్య భావనలపై భారత దేశం ఆధారపడ కూడదని పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ భావించారని అన్నారు. అంత్యోదయతో ప్రభుత్వ ఫలాలు అట్టడుగులోని అత్యంత చివరి వ్యక్తి వరకు చేరుకోవాలన్న దృఢ సంకల్పం బిజెపి ప్రభుత్వం అవలంభిస్తుందని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో సమర్ధవంతంగా కొనసాగుతుందన్న విశ్వాసం నేటి సమాజంలో కనిపిస్తుందన్నారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు, ఆలోచనలను అంకిత భావంతో ఆచరించడమే ఆ మహానుభావుడికి మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివసింగ్ రాందీన్, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్, సీనియర్ నాయకులు సంజీవ, నరసింహ రాజు, బాలకృష్ణ, సురేందర్, బబ్లూ సింగ్ ,శేఖర్, సుబ్రమణ్యం, శ్యామ్ యాదవ్, గోపాల్ విశాల్ సింగ్,డివిజన్ తదితరులు పాల్గొన్నారు.


దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

## పాలస్తీనాపై మోదీ సర్కారు మౌనం సరికాదు: సోనియాగాంధీ

ఈకబురు, దిల్లీ: పాలస్తీనా అంశంపై మోదీ సర్కారు మౌనం.. మానవత్వం, నైతికతలకు తిలోదకాలు ఇచ్చేలా ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మండిపడ్డారు. ఈ మేరకు ఆమె రాసిన వ్యాసం 'ఇండియాస్ మ్యూటెడ్ వాయిస్, ఇట్స్ డిటాచ్‌మెంట్ విత్ పాలస్తీనా' శీర్షికన గురువారం ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైంది. పాలస్తీనా అంశంపై ఇటీవలి కాలంలో ఆమె రాసిన మూడో వ్యాసమిది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీకి ఉన్న వ్యక్తిగత స్నేహం ప్రాతిపదికనే కేంద్ర ప్రభుత్వం విదేశాంగ విధానాల రూపకల్పన జరుగుతున్నట్లుగా అనిపిస్తోందని సోనియాగాంధీ విమర్శించారు. రాజ్యాంగ విలువలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోణంలో భారతదేశ విదేశాంగ విధానాలు ఉండాలే తప్ప, వ్యక్తిగత స్నేహాల ప్రాతిపదికన కాదని హితవు పలికారు. 'పాలస్తీనాను దేశంగా గుర్తిస్తూ ఇటీవలే ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా, పోర్చుగల్, ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు ఇలా 150కిపైగా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. వాస్తవానికి 1988 నవంబరు 18నే పాలస్తీనాను దేశంగా భారత్ గుర్తించింది. దశాబ్దాల తరబడి పాలస్తీనా విమోచన సంస్థకు అండగా నిలిచింది. ఈ చారిత్రక పరంపరను కొనసాగించాలి. ఈ దిశగా చొరవను, ధైర్యాన్ని చూపాలి' అని పేర్కొన్నారు.



# అయిదో రోజూ అదే పతనం



**సెన్సెక్స్ నష్టం 556 పాయింట్లు**

**25 వేల దిగువకు నిఫ్టీ**

ముంబై: హెచ్1–బీ ఫీజు పెంపు ఆందోళనలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ మార్కెట్ అయిదో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 556 పాయింట్లు క్షీణించి 81,160 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 166 పాయింట్లు కోల్పోయి 25 వేల స్థాయి దిగువన 24,891 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి జీవితకాల కనిష్టానికి చేరుకోవడం అంశాలు మరింత ఒత్తిడి పెంచాయి.

ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ గడిచే కొద్దీ మరింత నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 623 పాయింట్లు కోల్పోయి 81,093 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు నష్టపోయి 24,878 వద్ద కనిష్టాలు నమోదు చేశాయి. ఆసియాలో జపాన్ మినహా అన్ని దేశాల మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పతనమయ్యాయి. యూఎస్ స్టాక్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

బీఎస్ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో రియల్టీ 2%, విద్యుత్ 1.38%, ఐటీ 1.23%, యుటిలిటీస్ 1.21%, కన్జూమర్ డిస్క్రేషనరీ 1.41% పతనమయ్యాయి. స్మాల్ క్యాప్ సూచీ 0.75%, మిడ్‌క్యాప్ ఇండెక్సు 0,72% నష్టపోయాయి. నష్టాల మార్కెట్లోనూ టెలికమ్యూనికేషన్, మెటల్ షేర్లు రాణించాయి.

కొత్త హెచ్–1బీ వీసా దరఖాస్తులపై అమెరికా ప్రభుత్వం లక్ష డాలర్ల పెంపుతో దేశీయ ఐటీ కంపెనీల షేర్లు నాలుగోరోజూ డీలా పడ్డాయి. ఇన్ఫోబీన్స్ 2.64%, టీసీఎస్ 2.50%, హెక్సావేర్ టెక్ 2%, హెచ్‌సీఎల్ టెక్ 1.31%, విప్రో 1.06%, ఇన్ఫోసిస్ 0.64%, టెక్ మహీంద్రా 0.61% పతనయ్యాయి.

గడిచిన నాలుగు రోజుల్లో టెక్ మహీంద్రా షేరు 7% నష్టపోవడంతో రూ.10,729 కోట్ల మార్కెట్ క్యాప్ హరించుకుపోయింది. టీసీఎస్ (–6.6%) రూ.75,799 కోట్లు, విప్రో (–5.5%) రూ.14,799 కోట్లు, ఇన్ఫోసిస్(–3.6%) రూ.23,119 కోట్లు, హెచ్‌సీఎల్(–3%) రూ.11,940 కోట్ల మార్కెట్ విలువ కోల్పోయాయి. వెరసి ఈ 5 కంపెనీలకు 4 సెషన్లలో రూ.1.36 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.

ఐవాల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.299)తో పోలిస్తే 4.68% డిస్కౌంటుతో రూ.285 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 8.34% క్షీణించి రూ.274 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టపోయి రూ.282 వద్ద నిలిచింది.

# వెండి.. మరో రికార్డ్



న్యూఢిల్లీ: వెండి ధర గురువారం దేశీయంగా సరికొత్త జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. కిలోకి రూ.1,000 పెరిగి రూ.1,40 లక్షలకు చేరింది. మరోవైపు కొన్ని రోజులుగా రికార్డుల బాటలో నడిచిన పసిడి (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ.630 నష్టపోయింది. రూ.1,17,370 స్థాయి వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ స్పాట్ మార్కెట్లో వెండి ధర ఔన్స్‌కు 2 శాతానికి పైనే పెరిగి 45 డాలర్లకు చేరుకుంది.

దేశీయంగా ఎంసీఎక్స్ (ఫ్యూచర్స్) మార్కెట్లో డిసెంబర్ కాంట్రాక్టు వెండి ధర రూ.3,528 పెరిగి రూ.1,37,530 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. 10 గ్రా. బంగారం కాంట్రాక్టు ధర రూ.223 పెరిగి రూ.1,12,778కు చేరింది. రేట్ల తగ్గింపుపై ఫెడ్ సానుకూల వైఖరి, 2025లోనూ రేట్ల కోత ఉంటుందన్న అంచనాలు ధరల పెరుగుదలకు కారణమైనట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.

అంతర్జాతీయంగా అనిశ్చితులకుతోడు డాలర్‌పై ఆధారపడడం తగ్గించుకోవడం అన్నవి బంగారం, వెండిలో కొనుగోళ్లకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్స్‌కు 8 డాలర్ల నష్టంతో 3,760 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# కర్నూలు సహా దేశవ్యాప్తంగా ₹40వేల కోట్లతో రిలయన్స్ ఫుడ్ యూనిట్స్




దిల్లీ: పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (RCPL) పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఆహార పరిశ్రమ రంగంలో రూ.40 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 కార్యక్రమంలో ఈ ఒప్పందం కుదిరింది. ఇందులోభాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఓ పరిశ్రమను నెలకొల్పనుంది.ఇప్పటికే వివిధ వ్యాపారాల్లో నిమగ్నమై ఉన్న రిలయన్స్ సంస్థ వేగంగా విస్తరిస్తున్న కన్జూమర్ ప్రొడక్ట్స్ రంగం పైనా దృష్టిపెట్టింది. ఇందులోభాగంగా ఇటీవల జరిగిన ఏజీఎంలో పెట్టుబడులకు సంబంధించిన ప్రణాళికను బయటపెట్టింది. ఆసియాలోనే అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులను నెలకొల్పనున్నట్లు అందులో తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా కేంద్ర ప్రభుత్వంతో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన కటోల్‌లో ఫుడ్, బేవరేజెస్ యూనిట్లను రూ.1500 కోట్లతో నెలకొల్పనుంది.


కన్జూమర్ వ్యాపార విభాగంలో తనదైన ముద్ర వేసేందుకు రిలయన్స్ దూకుడుగా ముందుకెళ్తోంది. కాంపా, ఇండిపెండెన్స్ పేరుతో కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను విక్రయిస్తోంది. ఇతర కన్జూమర్ ప్రొడక్టులను తీసుకొచ్చేందుకు ట్యాగ్జ్ ఫుడ్స్ వంటి బ్రాండ్‌లనూ కొనుగోలు చేసింది. రాబోయే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ వెల్లడించారు. దేశంలోనే అతి పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీగా అవతరించడంతో పాటు విదేశాలకూ విస్తరించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్‌తో పాటు ఇతర కన్జూమర్ కేటగిరీల్లో విస్తరణకు బ్లూప్రింట్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

# నానో బనానా క్రేజ్: ఒక్క నెలలో 500 కోట్ల చిత్రాలు

గూగుల్ ఇటీవల జెమిని యాప్‌లో నానో బనానా అనే కొత్త ఇమేజ్ జనరేషన్ ఫీచర్‌ను ప్రారంభించింది. ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన నెల రోజుల్లో ఏకంగా 500 కోట్ల ఏఐ ఫోటోలను క్రియేట్ చేసింది. దీనిపై కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు.

500 కోట్ల చిత్రాలు పూర్తయ్యాయి. ఆ తరువాత ఫోటో నాదే అంటూ 'సుందర్ పిచాయ్' నానో బనన ఫోటో షేర్ చేశారు. ఒక్క నెలలో 500 కోట్ల ఫోటోలు అంటే.. దీనికున్న ఆదరణ అంతాఇంతా కాదు.

నానో బనానా ఫీచర్ ద్వారా.. యూజర్లు రెట్రో చిత్రాలు, నవరాత్రి లుక్స్ వంటివాటిని సృష్టిస్తున్నారు. నానో బనానా రూపొందించే ఏఐ 3డీ చిత్రాలు నిజమైనవి కాదు. ఇవి కేవలం డిజిటల్ ఇమేజెస్ మాత్రమే. ఇది చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉండటం వల్ల.. ఎవరైనా తమ ఫ్యూటోను కూడా 3డీగా చేసుకోవాలని ఆశపడతారు. ఈ కారణంగానే.. ఎక్కువమంది దీనిని ఉపయోగించారు.



# ఐటీ.. హైరానా పడక్కర్లేదు

హెచ్1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచినా, దేశీయ ఐటీ కంపెనీలపై ప్రభావం మరీ అధికంగా ఏమీ ఉండదని రేటింగ్ సంస్థ క్రిసిల్ పేర్కొంది. అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మన కంపెనీలు గత కొన్నేళ్లుగా అక్కడి విశ్వవిద్యాలయాల నుంచి నియామకాలు పెంచుకుంటున్నాయని గుర్తు చేసింది.

**2017తో పోలిస్తే సగం మందే**

అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకారం, 2017లో దేశీయ ఐటీ కంపెనీలు 34,507 హెచ్1బీ వీసాలు తీసుకున్నాయి. 2025లో ఇవి సగానికి తగ్గి 17,997కు పరిమితమయ్యాయి. ఇవి కూడా భారతీయ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ తరఫున హెచ్1బీ వీసాలతో పని చేస్తున్న వారివే. ఈ లెక్కన చూస్తే, గత 8 సంవత్సరాల్లో ఏడాదికి 9% చొప్పున దేశీయ కంపెనీలు హెచ్1బీ వీసాలను తగ్గించుకుంటూ వస్తున్నాయి. 2018లో ఈ వీసాల తిరస్కరణ రేటు 24 శాతానికి చేరాక, మన ఐటీ కంపెనీలు మరింత అప్రమత్తతతో వ్యవహరిస్తున్నాయని క్రిసిల్ తెలిపింది.

**నిర్వహణ మార్జిన్లపై ప్రభావం ఇలా**

గత ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల నిర్వహణ మార్జిన్లు సుమారు 22 శాతంగా ఉన్నాయి. హెచ్1బీ కొత్త వీసా రుసుము లక్ష డాలర్లకు పెంచినా, వీటిపై పంపే సిబ్బంది సంఖ్య తగ్గుతుంది కనుక ఐటీ కంపెనీల నిర్వహణ మార్జిన్లు 0.10.2 శాతమే తగ్గొచ్చని అంచనా వేసింది. అమెరికాలో స్థిరపడిన/స్థానికులను ఆన్‌షోర్ ఉద్యోగాల్లో నియమించుకుంటున్నందున.. రూ.88 లక్షలు చెల్లించి, భారత్ నుంచి ఉద్యోగులను పంపడాన్ని ఐటీ కంపెనీలు గణనీయంగా తగ్గించుకుంటాయని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి హెచ్1బీ వీసాల ప్రక్రియ పూర్తయినందున, ప్రస్తుతం ఎలాంటి ప్రభావమూ ఉండదని తెలిపింది. వచ్చే ఏడాదిలోనే అతి స్వల్పంగా ప్రభావం చూపొచ్చు. ఒకవేళ వ్యయాలు పెరిగినా, ఆ మొత్తాలను క్లయింట్ల నుంచే కంపెనీలు రాబట్టేందుకు ప్రయత్నిస్తాయని వివరించింది.



**వ్యయాల్లో ఉద్యోగుల వేతనాలే 57%**

గత ఆర్థిక సంతవ్సరం (2024-25) భారతీయ ఐటీ కంపెనీల వ్యయాల్లో, ఉద్యోగుల జీతభత్యాల వాటాయే 5557%. ఇందులో వీసా ఖర్చులు 0.02 0.05 శాతంగా ఉన్నాయి. ఒక్కో హెచ్1బీ వీసా నిమిత్తం 2,0005,000 డాలర్ల రుసుమును కంపెనీలు చెల్లించాయి. 2023 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు ఆమోదించిన 35% హెచ్1బీ దరఖాస్తులు తొలిసారిగా ఉద్యోగం చేస్తున్న వారివే. ఈ వాటా వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇలాగే కొనసాగితే మాత్రం కంపెనీలకు వీసా వ్యయాలు 1 శాతానికి చేరొచ్చు.

**విదేశాల నుంచే 96% ఆదాయం**

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ వంటి టైర్1 ఐటీ కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ల నుంచే 96% ఆదాయం ఆర్జిస్తున్నాయి. వీటి ఆదాయంలో అమెరికా వాటాయే కనీసం 53 శాతంగా ఉంటోంది. 202425లో ఐటీ పరిశ్రమ 119 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10.47 లక్షల కోట్ల) విలువైన సేవలను ఎగుమతి చేసింది. 202324లో విదేశాల నుంచి అత్యధికంగా 118.7 బి.డాలర్ల రెమిటెన్సెస్ మన దేశానికి రాగా, అందులో అమెరికా వాటానే 23 శాతం.

**ఐటీ షేర్లకు కొనసాగిన నష్టాలు:** హెచ్1బీ వీసా రుసుము ఆందోళనల నడుమ ఇన్ఫోబీన్స్ షేరు 2.64%, టీసీఎస్ 2.5%, హెచ్‌సీఎల్ టెక్ 1.31%, టెక్ మహీంద్రా 0.61%, విప్రో 1.06%, ఇన్ఫోసిస్ 0.64% వరకు గురువారమూ నష్టపోయాయి.

# ఆ కల ఓజీతో నెరవేరింది

ఓజాస్ గంభీరగా 'ఓజీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సుజీత్ తెరకెక్కించారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఈ సినిమా గురువారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ.. ''ఈ సినిమాతో మూడేళ్లుగా ప్రయాణిస్తున్నా. నేను 'జానీ' సినిమా రోజుల నుంచీ పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానిని. ఆయనతో ఇంత భారీ సినిమా చేయడం.. అది బ్లాక్‌బస్టర్ అవ్వడం నాకు చాలా ప్రత్యేకం. తమన్, నవీన్ నూలి, రవి కె.చంద్రన్.. ఈ ముగ్గురు లేకుంటే ఈ సినిమానే లేదు. దీనికి వీళ్లే మూలస్తంభాలు. కథ విన్న రోజు నుంచే ప్రతి ఒక్కరూ దీన్ని బలంగా నమ్మారు. దీంట్లో 'తమ్ముడు'లోని 'ట్రావెలింగ్ సోల్జర్' పాటతో పాటు 'జానీ' బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌ను వాడాలన్న ఆలోచన తమన్‌దే. అది క్లైమాక్స్‌కు మంచి ఊపు తీసుకొచ్చింది'' అన్నారు.''ఈ చిత్రాన్ని ప్రేక్షకులు చాలా సొంతం చేసుకున్నారు. పవన్ కల్యాణ్‌కు ఉన్న పవర్ ఇది. సుజీత్ ఈ కథ వినిపించినప్పుడే ఇది తెరపైకి వచ్చిన రోజున హిస్టరీ సృష్టిస్తుందని నమ్మేశా. ఎందుకంటే పవన్‌ను ఇలా కటానా.. కత్తులు, జపాన్ నేపథ్య కథలో చూడటం ప్రతి అభిమాని కల. అది ఇన్నాళ్లకు 'ఓజీ' రూపంలో నెరవేరింది. అందుకే ఈ విజయం మాది కాదు. పవన్ కల్యాణ్ అభిమానుల సక్సెస్ ఇది'' అన్నారు సంగీత దర్శకుడు తమన్.నిర్మాత డీవీవీ దానయ్య మాట్లాడుతూ.. ''ఈ సినిమా ఇలా తెరపై ఉండటానికి కారణం దర్శకుడు త్రివిక్రమ్. ఆయన వల్లే ఈ కాంబో కుదిరింది. తను లేకుంటే ఈ చిత్రం లేదు. మాకింత పెద్ద విజయం దక్కేది కాదు. ఈ సినిమా కోసం సుజీత్ రెండేళ్ల పాటు నిద్రలేని రాత్రులు గడిపారు. చాలా కష్టపడి అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చారు. ఇక ఈ చిత్రానికి 'ఓజీ' అనే టైటిల్ ఇచ్చినందుకు నిర్మాత నాగవంశీకి థ్యాంక్స్. ఈ పేరును తొలుత ఆయనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇంత పెద్ద సినిమాకి ఆ పేరు మాకు బాగా ఉపయోగపడింది'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ, కల్యాణ్ దాసరి, ఎడిటర్ నవీన్ నూలి, ప్రియాంక మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్‌ఎఫ్‌సీలో రెండు సినిమాలతో ప్రభాస్ సందడి



'సలార్', 'కల్కి' చిత్రాలతో వరుస విజయాల్ని అందుకున్న అగ్రహీరో ప్రభాస్.. తన రాబోయే సినిమాల్ని చకచకా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'రాజాసాబ్', 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్) సినిమాలు శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ రెండు సినిమాల షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇందులో భాగంగానే ఈ చిత్రాలకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాల్ని ఆర్‌ఎఫ్‌సీలోని వేర్వేరు ప్రదేశాల్లో తెరకెక్కిస్తున్నారు. హనురాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రంతో ఇమాన్వి కథానాయికగా పరిచయం అవుతోంది. వార్‌డ్రామా కథతో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మరోవైపు ప్రభాస్ ఇప్పటి వరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజాసాబ్'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు


# అల్లు అర్జున్ సలహాతోనే అలా తీర్చిదిద్దుకున్నా!




తమన్నా అందం.. అభినయాలకే కాదు.. ఆమె చేసే హుషారైన నృత్యాలకు సినీ ప్రియుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. అందుకే గత కొన్నేళ్లుగా ప్రత్యేక గీతాలకు పెట్టింది పేరుగా అన్ని చిత్రసీమల్లోనూ జోరు చూపిస్తోంది. అయితే డ్యాన్స్ విషయంలో తనని తాను ఉత్తమ నృత్యకారిణిగా తీర్చిదిద్దుకోవడంలో అల్లు అర్జున్ ఇచ్చిన సలహాలే ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపింది ఈ మిల్కీ బ్యూటీ. దీని వెనకున్న ఓ ఆసక్తికర విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. "అప్పట్లో నేను తెలుగు, తమిళ భాషల్లో అన్ని రకాల వాణిజ్య చిత్రాలు చేసేదాన్ని. ప్రతి సినిమాలోనూ కనీసం నాలుగైదు పాటల్లో చేస్తుండేదాన్ని. అయితే 'బద్రీనాథ్' చేస్తున్నప్పుడు అల్లు అర్జున్ నన్ను అత్యంత క్లిష్టమైన స్టెప్పుల్ని ప్రయత్నించమని పురిగొల్పారు. నేను తనతో పాటు ఫ్లోర్ మూమెంట్స్ చేయాలని పట్టుబట్టారు. నేను నిజంగా బాగా డ్యాన్స్ చేస్తానని, దానికి తగ్గట్లు అంతే కఠినమైన స్టెప్స్ కొరియోగ్రఫీ చేయాలని దర్శకుడితోనూ చెప్పారు. అలా దాని కోసం నేనెంతో కష్టపడి క్లిష్టమైన నృత్య దశల్ని ప్రయత్నించా. ఆ సినిమా విడుదలయ్యాక నాకు చాలా అవకాశాలొచ్చాయి. ముఖ్యంగా డ్యాన్స్ నంబర్లకు ప్రసిద్ధి చెందా" అని తమన్నా ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంది. అల్లు అర్జున్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం ఆయన పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదగడం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆమె హిందీలో 'రోమియో', 'రేంజర్' తదితర చిత్రాల్లో నటిస్తోంది.

# సీక్వెల్‌కి గ్రీన్ సిగ్నల్

బాలీవుడ్ 'క్రూ'లోకి మళ్లీ తిరిగొచ్చారట హీరోయిన్ కరీనా కపూర్. టబు, కరీనా కపూర్, కృతీ సనన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'క్రూ'. రాజేశ్ ఎ. కృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా చిత్రం 2024లో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన ఏక్తా కపూర్ 'క్రూ'కు సీక్వెల్‌ను ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఈ సన్నాహాల్లో భాగంగానే కరీనా కపూర్‌ను మేకర్స్ సంప్రదించగా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 'క్రూ' సినిమాలో మాదిరిగానే 'క్రూ 2'లోనూ ముగ్గురు హీరోయిన్లు ఉంటారట. కాక పోతే తొలి భాగంలో నటించిన టబు, కృతీ సనన్ రెండో భాగంలో ఉండరనే విషయంపై చర్చలు జరుగుతున్నాయని బాలీవుడ్ టాక్. ఈ ఇద్దరి స్థానంలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఇద్దరు కొత్త హీరో యిన్లు అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారట. మరి... ఫైనల్‌గా 'క్రూ 2'లో కరీనాతో పాటు నటించే ఆ ఇద్దరు హీరోయిన్లు ఎవరు అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు.



# 'అఖండ 2' విడుదల తేదీ ఖరారు!



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'అఖండ 2: తాండవం' విడుదల అధికారికంగా ఖరారైంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుందంటూ టీజర్‌తోపాటుగా ప్రకటించింది చిత్రబృందం. ఇది వరకే విడుదలైన టీజర్ కొన్ని థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఆ టీజర్‌కి కొత్తగా విడుదల తేదీని జోడించారు. 'ఓజీ' సినిమాతోపాటు ప్రదర్శితమవుతున్న టీజర్‌లో విడుదల తేదీని చూసి అభిమానులు సంబరాలు మొదలుపెట్టారు. బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన 'అఖండ' కూడా డిసెంబరు 2న విడుదల కాగా, ఆ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'అఖండ 2: తాండవం' 5న విడుదలవుతోంది. సంయుక్తా మేనన్, ప్రగ్యా జైస్వాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు.

# 'కాంతార 2'తో కృతి ప్రేమకథ?



ప్రేమికులుగా త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతున్నారు హీరో ధనుష్, కృతి సనన్. వీరిద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తుంది. ఈ చిత్ర టీజర్‌ను 'కాంతార:చాప్టర్ 1'తో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. "వచ్చే వారం ప్రారంభంలో ఈ సినిమా టీజర్‌ను అధికారికంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకుంది చిత్రబృందం. కానీ అక్టోబరు 2న రాబోతున్న 'కాంతార 2'కు దీన్ని జోడిస్తే.. సినీప్రియులకు మరింత దగ్గరయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీంతో పాటు 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' చిత్రంతో కూడా ఈ టీజర్‌ను థియేటర్లలో ప్రదర్శించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం నవంబరు 28న రాబోతుంది.

# ప్రతి మాస్క్ వెనుక ఓ సత్యంతో- జోన్ అలా తీర్చిదిద్దుకున్నా!



'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్' సిరీస్‌తో తొలిసారి ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని పలకరించనుంది శ్రద్ధా శ్రీనాథ్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌ని రాజేశ్ ఎం సెల్వ తెరకెక్కించారు. సంతోశ్ ప్రతాప్, చాందిని, హేమ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ అక్టోబరు 2నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ సిరీస్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ వర్చువల్ గేమ్ ఆడుతున్నప్పుడు దాని వల్ల నిజ జీవితంలో చోటు చేసుకున్న ఘటనలతో ఈ థ్రిల్లర్ సాగనున్నట్లు ఆ ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ సందర్భంగా శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ... "ఈ సిరీస్‌లో గేమింగ్ డెవలపర్ పాత్ర పోషించడం థ్రిల్లింగ్‌గా, సవాలుగా అనిపించింది. నా పాత్ర సృష్టించిన ప్రపంచమే తనకు వ్యతిరేకంగా మారి, ప్రాణాలతో తప్పించుకోలేని భయంకర పరిస్థితి సృష్టిస్తే ఏం జరిగిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది" అంది. "ట్రైలర్‌లో చెప్పినట్లుగా ప్రతి మాస్క్ వెనుక ఒక సత్యం దాగి ఉంటుంది" అన్నారు దర్శకుడు.

# ఉత్సాహంగా భారత్



జోరుమీదున్న టీమ్ఇండియా మరో పోరుకు సిద్ధమైంది. నామమాత్రమైన ఆఖరి సూపర్-4 మ్యాచ్‌లో శుక్రవారం శ్రీలంకను ఢీకొంటుంది. భారత జట్టు ఇప్పటికే ఆసియాకప్ ఫైనల్ చేరగా.. సూపర్ ఫోర్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడడంతో లంక పోటీ నుంచి నిష్క్రమించింది. వరుసగా విజయాలతో దూసుకెళ్తున్న సూర్యకుమార్ బృందాన్ని నిలువరించడం లంకకు కష్టమైనపనే. ఫీల్డర్లు క్యాచ్‌లు చేజారుస్తుండడం భారత్‌కు పెద్ద సమస్య మారింది. టోర్నీలో మన ఫీల్డర్లు ఇప్పటికే పది క్యాచ్‌లు నేలపాలు చేశారు. మరోవైపు బ్యాటింగ్ ఆర్డర్లో సంజు శాంసన్ స్థానాన్ని ఖరారు చేయడమూ భారత్‌కు ఇబ్బందిగా మారింది. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో శాంసన్ టాప్-7లో కూడా ఆడించలేకపోయారు. అక్షర్ పటేల్ కంటే ముందు కూడా సంజును పంపలేకపోతే అతడు జట్టులో ఉండి ఏం లాభం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బంగ్లాదేశ్‌పై దూబెను మూడో స్థానంలో పంపడం కూడా సత్ఫలితాన్నివ్వలేదు. ఈ నామమాత్ర మ్యాచ్‌లో శాంసన్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపే అవకాశముంది. గిల్ కంటే ముందు అతడు అభిషేక్‌తో కలిసి ఓపెనింగ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో అతడు మెరుగైన ప్రదర్శనే చేశాడు. ఈ టోర్నీలో పాకిస్థాన్‌పై అయిదో స్థానంలో శాంసన్ పరుగుల కోసం కష్టపడ్డాడు. ఒమన్‌పై మూడో స్థానంలో అర్ధశతకం చేసినా.. అంత సాధికారికంగా ఆడలేకపోయాడు. లంకపై ఎలా ఆడతాడో చూడాలి. ఇక ఓపెనర్ అభిషేక్ శర్మ భీకర ఫామ్ భారత్‌కు ఎంతో సంతోషాన్నిస్తోంది. ఇప్పటివరకు 200పై స్ట్రైక్‌రేట్‌తో 248 పరుగులు చేసిన అతడు.. టోర్నీ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. మరో ఓపెనర్ గిల్ కూడా ఫామ్‌లోనే ఉన్నాడు.

గత మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య రాణించడం భారత్‌కు సానుకూలాంశమే. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాట్ ఝళిపించాల్సివుంది. ఇక బంతితో స్పిన్నర్లు కుల్‌దీప్, వరుణ్ చక్రవర్తి చక్కగా రాణిస్తున్నారు. గత మ్యాచ్‌తో స్పీడ్‌స్టర్ బుమ్రా కూడా లయను అందుకున్నాడు. మరోవైపు శ్రీలంక ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఊరట పొందాలనుకుంటోంది. కానీ అసాధారణంగా పుంజుకుంటే తప్ప ఆ జట్టు టీమ్ఇండియాను అడ్డుకోలేదు.

# ఈ కథ మలుపు తిరుగుతుందా?



**మరో 4 రోజుల్లో మహిళల ప్రపంచకప్**

**జూన్ 25 1983.. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత కీలకమైన రోజు. దేశంలో క్రికెట్ విప్లవానికి పునాది పడిన దినం. సంచలన ప్రదర్శనతో కపిల్ డెవిల్స్ ఆ రోజు వన్డే ప్రపంచకప్‌ను సొంతం చేసుకోవడంతో భారత క్రికెట్ ముఖ చిత్రమే మారిపోయింది. తమ కథను మలుపు తిప్పే అలాంటి గొప్ప సందర్భం కోసమే ఎప్పట్నుంచో ఎదురు చూస్తోంది భారత మహిళల జట్టు. కానీ అవకాశం అందినట్లే అంది చేజారుతోంది. మరి ఈసారైనా కథ మారుతుందా? కల నెరవేరుతుందా?**

వాళ్లు ఆడేదే అప్పుడప్పుడూ. అప్పుడు కూడా స్టేడియాలు ఖాళీ. స్పాన్సర్‌షిప్‌ల ఊసే ఉండేది కాదు. మ్యాచ్ ఫీజులు నామమాత్రం. పేరుకు అంతర్జాతీయ క్రికెటర్లు వసతి, ప్రయాణ ఖర్చులకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి! అలాంటి స్థితి నుంచి దేశంలో మహిళల క్రికెట్ ఎంతో ఎదిగింది. బీసీసీఐ గొడుగు కిందికి వచ్చాక పురుషులతో సమానంగా వారికి మ్యాచ్ ఫీజులు అందుతున్నాయి. స్పాన్సర్‌షిప్‌లకు లోటు లేదు. వాళ్లాడుతుంటే చూసేందుకు జనాలూ బాగానే వస్తున్నారు. ఇలా ఎన్ని మార్పులు చూసినప్పటికీ.. పురుషుల క్రికెట్‌తో పోలిస్తే అమ్మాయిల ఆట కింది స్థాయిలోనే ఉంటోంది. ప్రపంచ క్రికెట్‌పై భారత అమ్మాయిలు బలమైన ముద్ర వేయలేకపోతున్నారు. తమ ఆధిపత్యాన్ని చాటలేకపోతున్నారు. మహిళల క్రికెట్‌ను ఓ గొప్ప మలుపు తిప్పే సందర్భం కోసం నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. అది ప్రపంచకప్ విజయంతోనే సాధ్యం అన్నది స్పష్టం. దీని కోసం దశాబ్దాలుగా భారత జట్టు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కానీ ఫలితం ఉండట్లేదు. 1973 నుంచి మొదలుపెడితే మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరిగాయి. టీ20 ఫార్మాట్లో జరిగిన ప్రపంచకప్‌లు 9. కానీ ఒక్కసారీ భారత అమ్మాయిలు విజేతగా నిలవలేదు. పురుషుల జట్టు వన్డేల్లో రెండు, టీ20ల్లో రెండు చొప్పున ప్రపంచకప్‌లు సాధించింది. ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా కొనసాగుతోంది. కానీ మహిళల జట్టు మాత్రం ఆ ఒక్క విజయం కోసం ఎదురు చూస్తూనే ఉంది.

ఆ రెండుసార్లు..: మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు రెండుసార్లు ఫైనల్ చేరింది. కానీ కప్పు గెలవలేకపోయింది. 2005లో దిగ్గజ క్రికెటర్ మిథాలి రాజ్ సారథ్యంలో పెద్దగా అంచనాల్లేకుండా బరిలోకి దిగిన మహిళల జట్టు ఫైనల్ చేరింది. కానీ బలమైన ఆస్ట్రేలియా చేతిలో 98 పరుగుల తేడాతో ఓడిపోయింది. 2017లో భారత్‌కు మెరుగైన అవకాశాలే కనిపించాయి. హర్మన్‌ప్రీత్ సంచలన ఇన్నింగ్స్ (171 నాటౌట్)తో సెమీస్‌లో ఏకంగా ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్ చేరింది భారత్. కానీ తుది పోరులో బాగానే పోరాడినప్పటికీ.. 9 పరుగుల స్వల్ప తేడాతో ఇంగ్లాండ్ చేతిలో ఓటమి తప్పలేదు. హర్మన్‌ప్రీత్ తుది పోరులోనూ అర్ధశతకంతో జట్టును గెలిపించడానికి గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈసారి హర్మన్ నాయకత్వంలోనే భారత జట్టు ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది.

మరి ఈసారి?: ఇప్పటిదాకా ప్రపంచకప్ బరిలో నిలిచిన అన్ని జట్ల కంటే ఈసారి ఆడుతున్న జట్టు మెరుగు అన్నది విశ్లేషకుల అభిప్రాయం. బ్యాటింగ్, బౌలింగ్‌లో జట్టు సమతూకంతో కనిపిస్తోంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ, రిచా ఘోష్, రేణుక సింగ్ లాంటి మ్యాచ్ విన్నర్లు అందుబాటులో ఉన్నారు. ఇటీవలి ఫామ్ కూడా బాగుంది. భీకర ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో జట్టు సత్తా చాటింది. కంగారూల చరిత్రలోనే అతి పెద్ద వన్డే ఓటమిని మిగిల్చింది హర్మన్‌ప్రీత్ సేన. సిరీస్ ఓడినప్పటికీ.. కంగారూలకు దీటుగా స్పందించి, తన బలాన్ని చాటింది. సొంతగడ్డపై ప్రపంచకప్ ఆడుతుండటం అతి పెద్ద సానుకూలత. ఒకప్పుడు మహిళల జట్టు ఆడుతున్నా పెద్దగా జనం వచ్చేవారు కాదు. ఇప్పుడు ఇండియా మ్యాచ్‌లకు స్టేడియాలు నిండుగా కనిపిస్తే ఆశ్చర్యం లేదు. జట్టు మెరుగ్గా ఉంది. అభిమానుల అండా ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో ఆడితే కల నెరవేర్చుకోవడం కష్టమేమీ కాదు. మరి నవంబరు 2న అద్భుతం ఆవిష్కృతమవుతుందా? ఈసారి మహిళల క్రికెట్ కథ మలుపు తిరుగుతుందా?



# మ్యాచ్ విన్నర్లమనే నమ్ముతాం: స్మృతి



దిల్లీ: భారత మహిళల జట్టులో ఉన్న ప్లేయర్లందరూ తాము మ్యాచ్ విన్నర్లమనే నమ్ముతారని స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన పేర్కొంది. గత టీ20 ప్రపంచకప్ నుంచి టీమ్ఇండియాలో వచ్చిన మార్పు ఇదేనని ఆమె తెలిపింది. "మాపై మాకు విశ్వాసం పెరిగింది. 2013 నుంచి మహిళల క్రికెట్ ఎంతో మారింది. డబ్ల్యూపీఎల్‌తో ఆదరణ ఇంకా పెరిగింది. ముఖ్యంగా గత టీ20 ప్రపంచకప్ తర్వాత మేమంతా మ్యాచ్ విన్నర్లమనే అందరూ నమ్ముతున్నారు. సొంతగడ్డపై జరిగే వన్డే ప్రపంచకప్ గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం" అని స్మృతి చెప్పింది. తాను అరంగేట్రం చేసిన జెర్సీ ఇప్పటికి భద్రంగా దాచుకున్నానని స్మృతి తెలిపింది. "17 ఏళ్ల వయసులో భారత జట్టులోకొచ్చా. తొలిసారి జెర్సీ ధరించిన ఫొటోలను నా కుటుంబ సభ్యులకు పంపి మురిసిపోయా. మేం సంగ్లిలో నివసించేవాళ్లం. అప్పట్లో అక్కడ ఎక్కువమంది అమ్మాయిలు క్రికెట్ ఆడేవాళ్లు కాదు. అందుకే పుణె వచ్చి శిక్షణ పొందేదాన్ని. ఇందుకోసం నాలుగైదు నెలల కుటుంబానికి దూరం ఉండాల్సి వచ్చేది. అందుకే భారత్‌కు ఎంపిక కాగానే చాలా ఉద్వేగంగా అనిపించింది. కామన్వెల్త్ క్రీడల్లో ఆస్ట్రేలియాతో సెమీస్‌లో రాణించడం చాలా గర్వంగా భావించా" అని స్మృతి గుర్తు చేసుకుంది.

# పాక్‌తోనే ఫైనల్



దుబాయ్: ఈ ఆసియాకప్ టీ20 టోర్నీలో మూడోసారి భారత్, పాక్ సమరాన్ని చూడబోతున్నాం. పాకిస్థాన్ కూడా ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం బంగ్లాదేశ్‌తో నిర్ణయాత్మక సూపర్ 4 మ్యాచ్‌లో బ్యాటుతో తడబడ్డప్పటికీ అద్భుత బౌలింగ్‌తో పాక్ గట్టెక్కింది. 11 పరుగుల తేడాతో నెగ్గింది. 136 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ చతికిల పడింది. 9 వికెట్లకు 124 పరుగులే చేయగలిగింది. షహీన్ షా అఫ్రిది (3/17), రవూఫ్ (3/33) సైమ్ అయూబ్ (2/16) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బంగ్లాను దెబ్బతీశారు. తొలి ఓవర్లోనే ఓపెనర్ ఎమాన్ (0) వికెట్‌ను కోల్పోయిన బంగ్లా ఆ తర్వాత ఏ దశలోనూ నిలదొక్కుకోలేదు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. షమిమ్ (30; 25 బంతుల్లో 2×6) పోరాటం సరిపోలేదు. అంతకుముందు పాకిస్థాన్ కూడా బ్యాటుతో కష్టపడింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 8 వికెట్లకు 135 పరుగులే చేయగలిగింది. ఆ జట్టు ఏ దశలోనూ జోరందుకోలేకపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. పాకిస్థాన్ 135 పరుగులు చేయడం కూడా గొప్పే. ఎందుకంటే ఆ జట్టు ఓ దశలో 49కే అయిదు వికెట్లు కోల్పోయింది. ఆ దశలో పాక్‌ను హారిస్ (31; 23 బంతుల్లో 2×4, 1×6) ఆదుకున్నాడు. అతడు.. షహీన్ షా అఫ్రిది (19)తో ఆరో వికెట్‌కు 22, నవాజ్ (25; 15 బంతుల్లో 1×4, 2×6)తో ఏడో వికెట్‌కు 38 పరుగులు జోడించాడు. అష్రాఫ్ 14 పరుగులతో అజేయంగా నిలిచాడు. తస్కిన్ అహ్మద్ (3/28), రిషాద్ హొస్సేన్ (2/18), మెహదీ హసన్ (2/28) పాక్ పతనాన్ని శాసించారు. ఆసియాకప్ ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

సంక్షిప్త స్కోర్లు...

పాకిస్థాన్: 135/8 (హారిస్ 31, నవాజ్ 25, షహీన్ అఫ్రిది 19, సల్మాన్ ఆఘా 19; తస్కిన్ 3/28, రిషాద్ 2/18, మెహదీ హసన్ 2/28);

బంగ్లాదేశ్: 124/9 (షమిమ్ 30, సైఫ్ 18, నురుల్ 16, రిషాద్ 16; షహీన్ అఫ్రిది 3/17, రవూఫ్ 3/33; సైమ్ అయూబ్ 2/16)

# బెంగళూరుపై యూపీ పైచేయి




జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్12లో బెంగళూరు మళ్లీ ఓటమి బాట పట్టింది. గురువారం ఆ జట్టు పోరాడినా.. యూపీ యోధాస్ చేతిలో పరాజయం తప్పలేదు. మొదట బెంగళూరు, యూపీ 3636తో సమంగా నిలిచాయి. అయిదు అదనపు రెయిడ్‌లు ఆడించగా.. 65తో యూపీ పైచేయి సాధించింది. భవాని రాజ్‌పుత్ (10), గగన్ గౌడ (6) ఆ జట్టు గెలుపులో కీలకమయ్యారు. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 4726తో యు ముంబాపై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో తొలి అర్ధభాగంలో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. దిల్లీ 1917తో బ్రేక్‌కు వెళ్లింది. రెండో అర్ధంలో దూకుడు పెంచిన దిల్లీ.. తేలిగ్గా విజయాన్ని అందుకుంది. అషు మలిక్ (23) ఒంటి చేత్తో ఆ జట్టును గెలిపించాడు.

# ఆటకు తగ్గట్టుగా మెరుగయ్యాం: సాత్విక్ చిరాగ్

దిల్లీ: బ్యాడ్మింటన్ ఆటలో వేగం పెరిగిపోయిందని.. అందుకు తగ్గట్లుగా మెరుగయ్యామని భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అన్నారు. గత 16 నెలల్లో శైలి, సర్వీస్ వైవిధ్యాలపై దృష్టిసారించడం వల్లే పుంజుకోగలిగామని తెలిపారు. నిరుడు గాయాలు, అనారోగ్యంతో ఇబ్బందిపడిన సాత్విక్, చిరాగ్.. ఈ ఏడాది అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. పారిస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిసిన భారత క్రీడాకారులు.. హాంకాంగ్ ఓపెన్, చైనా మాస్టర్స్‌లో ఫైనల్ చేరుకుని సత్తాచాటారు. "అటాకింగ్ మా ప్రధాన బలం. కాని డిఫెన్స్‌లో కాస్త మెరుగవ్వాలి. కీలక సమయాల్లో ప్రశాంతంగా, దృఢంగా ఉండాల్సినప్పుడు డిఫెన్స్‌కు బదులు అటాకింగ్ చేస్తున్నాం. ఒత్తిడిలో మంచి డిఫెన్స్ ఆడలిగితే మరింత ముందుకు వెళ్లగలం. ర్యాలీలతో ఆటను ప్రారంభిస్తున్నాం. మ్యాచ్ వేడెక్కగానే అటాకింగ్ ఆడుతున్నాం. కాబట్టి ఒత్తిడిలో డిఫెన్స్‌ను మెరుగుపరుచుకోవడం కీలకం" అని సాత్విక్ తెలిపాడు. "కోచ్ టాన్ కిమ్ హెర్ (మలేసియా) సూచన మేరకు సర్వీస్‌లో మార్పులు చేసుకున్నాం. ఒకరు సర్వ్ చేయగానే మరొకరు ముందు కోర్టులోకి వెళ్లి ప్రత్యర్థిని ఎదుర్కొంటాడు. గత రెండు, మూడు టోర్నీల్లో ఈ వ్యూహం బాగా పనిచేసింది. నిరుటితో పోల్చుకుంటే గత కొన్ని టోర్నీల్లో సర్వీస్ చాలా మెరుగైంది. ఆటలో బాగా వేగం పెరిగింది. ఒక్క శైలిపైనే ఆధారపడలేం. భిన్నమైన వ్యూహాలు అవసరం. ఆ దిశగానే ప్రయత్నిస్తున్నాం" అని చిరాగ్ చెప్పాడు.



# ఇండియా-ఎ కెప్టెన్‌గా శ్రేయస్



దిల్లీ: టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సమస్యల వల్ల ఆరు నెలల పాటు ఎర్ర బంతి క్రికెట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే అతణ్ని వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టుకు సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. అతణ్ని ఈ నెల 30 నుంచి ఆస్ట్రేలియా-ఎతో మూడు వన్డేల సిరీస్‌లో తలపడే భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. గత ఏడాది శ్రేయస్ వెన్నునొప్పితో ఇబ్బంది పడ్డాడు. సుదీర్ఘ ఫార్మాట్లో ఆడితే ఆ ఇబ్బంది పెరుగుతుండడంతో శ్రేయస్.. విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

"తాను ఆరు నెలల పాటు ఎర్ర బంతి క్రికెట్‌కు దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు బీసీసీఐకి శ్రేయస్ సమాచారం ఇచ్చాడు. శ్రేయస్ ఎప్పుడూ ఆడుతూ ఉండాలని, బాగా ఆడాలని మేం కోరుకుంటాం. అతడికి సారథ్యం కొత్త కాదు" అని భారత చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చెప్పాడు. శ్రేయస్ నిర్ణయం నేపథ్యంలో అతణ్ని ఇరాని కప్‌లో తలపడే రెస్టాఫ్ ఇండియా జట్టులోకి కూడా ఎంపిక చేయలేదు. ఆ జట్టుకు రజత్ పాటీదార్ నాయకత్వం వహిస్తాడు. ప్రస్తుతం ఆసియా కప్‌లో ఆడుతున్న అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.. ఆస్ట్రేలియా-ఎతో వన్డే సిరీస్‌లో రెండో మ్యాచ్ నుంచి అందుబాటులోకి వస్తారు.

ఇండియా-ఎ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్, రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెగ్డే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జన్‌ప్రీత్ సింగ్, యుధ్వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్, ప్రియాంశ్ ఆర్య, సిమ్రన్‌జీత్ సింగ్; రెస్టాఫ్ ఇండియా జట్టు: రజత్ పాటీదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్, రుతురాజ్ గైక్వాడ్, యశ్ ధూల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్, తనుష్ కొటియన్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాశ్‌దీప్, అన్షుల్ కాంబోజ్, సారాంశ్ జై